

తహసీల్దార్ ఆఫీస్ ముట్టడి

వీర్నపల్లి(సిరిసిల్ల): పోడుపట్టాలు పంపిణీ చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీర్నపల్లి తహసీల్దార్ ఆఫీస్‌ను పోడు రైతులు గురువారం ముట్టడించారు.



ఐలమ్మ జంక్షన్ పరిశీలన

సిరిసిల్లటౌన్: చాకలి ఐలమ్మ జంక్షన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ గురువారం పరిశీలించారు. త్వరలోనే జంక్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 33.0/23.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం ఇల్లంతకుంట మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఇల్లంతకుంటకు చేరుకుని.. 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. మహిళా సమాఖ్య భవనం ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతారు.

అనర్హులకు గృహలక్ష్మి

- పంపిణీని అడ్డుకున్న దరఖాస్తుదారులు




గంభీరావుపేట(సిరిసిల్ల): అనర్హులను గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేశారంటూ పలువురు లబ్ధిదారులు పట్టాల పంపిణీని అడ్డుకున్నారు. స్థానిక మండల పరిషత్‌లో గురువారం గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరుపత్రాల పంపిణీ చేపట్టారు. అర్హులను అటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇటు గృహలక్ష్మికి ఎంపిక చేయలేదంటూ గంభీరావుపేట, సముద్రలింగాపూర్ ఎంపీటీసీలు రాజేందర్‌రెడ్డి, పర్శరాములు అధికారులపై మండిపడ్డారు. దరఖాస్తుదారులు అధికారులను నిలదీశారు. మళ్లీ ఎంపికచేయాలంటూ పట్టుబట్టారు. దీంతో పంపిణీ కార్యక్రమం నిలిపేశారు. ప్రభుత్వం ఏటా మహిళలకు అందించే బతుకమ్మ చీరల పంపిణీ చేసేందుకు వేదికపైకి ఎంపీపీ వంగ కరుణ, వైస్‌ఎంపీపీ దోసల లత, ఎంపీడీవో శ్రీనివాస్ రాగా.. దరఖాస్తుదారులు అడ్డుకున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. ఎల్లారెడ్డిపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. కరెంట్ సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ విద్యుత్‌పరంగా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి వస్తుందన్నారు. భవిష్యత్‌లో సబ్‌స్టేషన్‌ను విస్మరిస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు లోవోల్టేజీ సమస్య లేకుండా చూస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లోని లోపాలు సరిచేస్తామన్నారు. వరంగల్ డీఈ ఐటీ అనిల్, కరీంనగర్ డీఈ ఆపరేటర్ రాజం, ఏడీఈ ప్రదీప్, ఏఈలు శ్రీనివాస్‌రెడ్డి, పృథ్వీధర్‌గౌడ్ ఉన్నారు.

ఇల్లు చిరకాల స్వప్నం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రతి ఒక్కరికి సొంతిల్లు చిరకాల స్వప్నమని.. అర్హులకు గృహలక్ష్మి పథకం వర్తిస్తుందని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి 452 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందించారు. వారు మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా శిథిలావస్థలో ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రొసీడింగ్స్ అందించినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్‌లు రాని వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం 24 గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్‌కిట్స్ పంపిణీ చేశారు. ఎంపీడీవో చిరంజీవి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎనగందుల అనసూయ పాల్గొన్నారు.

స్కూటీల కోసం ఆందోళన

కోనరావుపేట(వేములవాడ): అర్హులకు స్కూటీలు అందించలేదంటూ జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య ఎదుట దివ్యాంగులు ఆందోళనకు దిగారు. గురువారం కోనరావుపేట మండల పరిషత్‌లో దివ్యాంగులకు స్కూటీల పంపిణీ చేశారు. మండలంలో 40 మంది దరఖాస్తు చేసుకోగా 9 మందికే అందజేశారు. దీంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులు ఇంతమంది ఉంటే కొద్దిమందికే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. స్పందించిన చైర్‌పర్సన్ త్వరలోనే అందరికీ ఇస్తామని హామీ ఇచ్చినా వారు నిరాశతో వెళ్లిపోయారు.

సర్కారీ టౌన్‌షిప్

- సిరిసిల్లలో మోడల్ లే అవుట్
- పెద్దూరు శివారులో అభివృద్ధి
- 29 ప్లాట్లు వేలానికి సిద్ధం
- 20.87 ఎకరాల్లో వెంచర్
- వేలానికి వెళ్లనున్న ప్రభుత్వం



సిరిసిల్ల శివారులో మున్సిపల్ మోడల్ లే అవుట్

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం దినదినాభివృద్ధి చెందుతుంది. నలువైపులా విస్తరిస్తుంది. ఈక్రమంలోనే నగరాల్లో మాదిరిగానే స్థానికంగా ప్రభుత్వ మోడల్ లేఅవుట్ తీర్చిదిద్దుతున్నారు. ప్రైవేటు వెంచర్లకు దీటుగా సకల వసతులతో సర్కారీ టౌన్‌షిప్ వేలానికి సిద్ధమైంది.

మొదటి వెంచర్ సిద్ధం

మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వెంచర్‌ను అభివృద్ధి చేశారు. పట్టణ శివారులోని వెంకటాపూర్-రగుడు బైపాస్‌రోడ్డులోని ప్రభుత్వ లేఅవుట్లలో ఓపెన్‌ప్లాట్లను సిద్ధం చేశారు. వీటిని బహిరంగవేలంతో విక్రయించేందుకు పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. పెద్దూరు శివారులోని సర్వేనంబర్ 405లో 20-87 ఎకరాలలో 239 ప్లాట్లతో వెంచర్ ఏర్పాటైంది. వీటిలో 146, 162, 166, 183, 200, 216, 222, 244, 288 చదరపు గజాల సైజుల్లో ప్లాట్లను ఏర్పాటు చేశారు. కనీస ధర గజానికి రూ.5వేలు నుంచి రూ.6వేల వరకు నిర్ణయించారు.

టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వారితో మున్సిపల్ ఆధ్వర్యంలో టైన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ పట్టాదారుల భూముల్లో మెడికల్ కాలేజీ, కేజీబీవీ, రేడియాలజీ మెడికల్ హబ్ నిర్మితంకాగా.. టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరితహోటల్ నిర్మిస్తున్నారు. వీటికి సుమారు 80 ఎకరాల భూమి అవసరం ఉండగా.. ప్రభుత్వ స్థలాలు పోను పట్టాదారుల నుంచి భూమిని సేకరించారు. వారికి ప్రభుత్వ మోడల్ లేఅవుట్స్‌లో ఎకరానికి వేయి గజాలు కేటాయించారు. ఈమేరకు ప్రొసీడింగ్స్ సైతం అందజేశారు.

శరవేగంగా అభివృద్ధి

సర్కారీ టౌన్‌షిప్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. మొదటి విడతలో పెద్దూరు శివారులోని డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ వెనకాల 20.87 ఎకరాల్లో మొదటి వెంచర్ ఏర్పాటైంది. టౌన్‌షిప్‌లో రోడ్లు, మోరీలు, వీధిదీపాలు, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.8కోట్లను మున్సిపల్ పాలకవర్గం పరిపాలన పరమైన మంజూరులు ఇచ్చింది. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో నాలుగు నెలలుగా వెంచర్ అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే 70 శాతం రోడ్లు, 30 శాతం డ్రెయినేజీ పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో పదిహేను రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు ఓపెన్ యాక్షన్ ద్వారా ప్లాట్లను విక్రయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మోడల్ లే అవుట్ స్వరూపం

విస్తీర్ణం	20.87 ఎకరాలు
ప్లాట్లు	239
గజానికి ధర	రూ.5 నుంచి 6వేలు
వెంచర్ విలువ (సుమారు)	రూ.15కోట్లు
మౌలిక వసతులకు..	68వేల చదరపు గజాలు(సుమారు)
ప్లాటింగ్ 32 వేల చదరపు గజాలు(సుమారు)	

ప్రయోజనాలు ఇవీ..

- ప్రభుత్వ వెంచర్ కాబట్టి ఇంటి నిర్మాణాలకు ఎలాంటి ప్రతిబంధకాలు ఉండవు.
- టైటిల్ క్లియర్ ఉండటంతో న్యాయపరమైన ఇబ్బందులు కలుగవు. ఆదాయ అర్హతలను బట్టి జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు పొందడం సులువు.
- ఓపెన్ ప్లాట్లకు ప్రత్యేకంగా ఎల్ఆర్ఎస్ చార్జీలు కట్టాల్సిన అవసరం ఉండదు.

పట్టణాభివృద్ధికి తొలి ప్రయత్నం



మోడల్ లేఅవుట్‌పై ప్రజలు ఎలాంటి అపోహలు పడొద్దు. మౌలిక వసతులతో ఏర్పాటవుతుంది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పట్టణాభివృద్ధికి కేటాయిస్తాం. ఇతర నగరాలు, పట్టణాల్లో కూడా ఇటువంటి వెంచర్లు ఉన్నాయి. ప్లాట్స్ కొనుగోలు చేసే వారికి ముందస్తుగా అవగాహన కల్పించాకే బహిరంగ వేలం నిర్వహిస్తాం. త్వరలోనే తేదీలు ప్రకటిస్తాం.

– ఎండీ ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

నిండుకుండలా మిడ్‌మానేరు



- ప్రాజెక్టులో తొలిసారి రికార్డుస్థాయిలో 27 టీఎంసీలు
- సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వరకు బ్యాక్ వాటర్
- మూడు నెలల్లో ప్రాజెక్టులోకి 23.054 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టులో తొలిసారిగా 27 టీఎంసీలకు నీరు చేరింది. గతేడాది 26.12 టీఎంసీల వరకు చేరగా.. ఈసారి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ఎనిమిది ఇంచుల దూరంలో ఉంది. బ్యాక్‌వాటర్ ఏకంగా 17 కిలోమీటర్ల దూరంలోని సిరిసిల్ల బతుకమ్మఘాట్ వరకు చేరింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు పునాదులు వేశారు. సీఎం కేసీఆర్ ప్రాజెక్టులో 27 టీఎంసీల మేర నీరు నిలిచేలా కృషి చేశారు.

సిరిసిల్ల బతుకమ్మఘాట్ వరకు బ్యాక్‌వాటర్

రెండేళ్ల క్రితం మిడ్‌మానేరులో 20 టీఎంసీల నీరు చేరికతోనే బోగం ఒర్రె ప్రాంతంలో లీకేజీ ఉందని ఊహాగానాలు వచ్చాయి. అప్పటి ఎస్ఈ శ్రీకాంత్‌రావు, ఈఈ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నపాటి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం 27.3 టీఎంసీల మేర నీరు నిల్వ ఉండడంతో బ్యాక్‌వాటర్ సిరిసిల్ల బతుకమ్మఘాట్ వరకు చేరింది. ఏకంగా 17 కిలోమీటర్ల మేర నీరు చేరి కొదురుపాక, నీలోజిపల్లి, సంకెపల్లి, ఆరెపల్లి, వరదవెల్లి, అనుపురం, కొదుముంజ గ్రామాలు నీటిలో మునిగిపోయాయి.

ఫోర్‌లేన్ బ్రిడ్జి వద్ద 17 మీటర్ల లోతు

సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిలో కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వద్ద ఏకంగా 17 మీటర్ల మేర నీటి నిల్వలు(60 ఫీట్లు) ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో తాటిచెట్లు, వాటర్‌ట్యాంకులు మునిగిపోయాయి. గతేడాది పై ప్రాంతం నుంచి భారీ వరద వచ్చినా ప్రాజెక్టులో 26.12 టీఎంసీల మేరకే నీటిని నిల్వ చేశారు. అప్పటి వరకు వేములవాడ మండలం సంకెపెల్లి ఆర్ అండ్‌ఆర్ చెల్లింపులు పూర్తికాలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో 26 టీఎంసీల పరిమితం చేశారు. ఇప్పుడు ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు తీరడంతో ఏకంగా 27.03 టీఎంసీల మేర నీరు నిల్వ చేశారు.

జూన్ 1 నుంచి ఈనెల 5 వరకు మిడ్‌మానేరు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో

ఇన్‌ఫ్లో	:37.558 టీఎంసీలు
ఔట్ ఫ్లో	:31.606 టీఎంసీలు
ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం	: 27.55 టీఎంసీలు

ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు : 27.3 టీఎంసీలు

తొలిసారిగా 27 టీఎంసీలు



మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలు కాగా తొలిసారిగా 27.3 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. పూర్తి నీటి నిల్వకు కేవలం 8 ఇంచుల దూరంలో ఉంది. గతేడాది 26.12 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ చేశాం. కొదురుపాక బ్రిడ్జి పరిసరాల్లో 66 ఫీట్ల మేర నీటి లోతు ఉంది.

– జగన్, ఈఈ, మిడ్‌మానేరు ప్రాజెక్టు

మూడు నెలల్లో 23 టీఎంసీల వరద

జూన్ 1 నుంచి ఈనెల 5 వరకు 37.558 టీఎంసీల వరద ఇన్‌ఫ్లోగా వచ్చింది. 23.034 టీఎంసీల మేర వచ్చి చేరడం గమనార్హం. ఎస్సారెస్పీ నుంచి 12.564 టీఎంసీలు, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 1.960 టీఎంసీల మేర వరద వచ్చింది.

31.606 టీఎంసీల ఔట్‌ఫ్లో

మిడ్‌మానేరు నుంచి మూడు నెల్లో 31.606 టీఎంసీల నీరు విడుదల చేశారు. కరీంనగర్ ఎల్ఎండీలోకి 24.072 టీఎంసీల మేర నీరు విడుదల చేశారు. అనంతగిరి పదో ప్యాకేజీలోకి 4.794 టీఎంసీలు, కుడికాల్వకు 0.726 టీఎంసీలు, ఎడమకాల్వకు 0.048 టీఎంసీలు, ఈవీపీ అండ్ మిషన్ భగీరథకు 1.966 టీఎంసీలు విడుదల చేశారు.

ఆడపడుచుల కోసమే కానుకలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట/వేములవాడ: ఆడపడుచుల కోసమే బతుకమ్మ చీరలను ప్రభుత్వం అందజేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేటలో బతుకమ్మ చీరల పంపిణీని గురువారం చేపట్టారు. మండలంలో 17,640 బతుకమ్మ చీరలు, 9 మందికి స్కూటీలు, 26 మందికి వినికిడి యంత్రాలు, ఐదుగురికి వీల్‌చైర్లు, 48 మందికి నడుముపట్టీలతోపాటు పలువురికి చేతికర్రలు, బాత్‌రూమ్ చైర్లు పంపిణీ చేశారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్లు నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, సీడీపీవో ఎల్లయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

రాష్ట్రంలోని ఆడపడుచులకు సీఎం కేసీఆర్ పెద్దన్నలాగా బతుకమ్మ పండుగకు చీరలు అందజేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. పట్టణంలోని 9వ వార్డులో గురువారం బతుకమ్మ చీరల పంపిణీని కమిషనర్ అన్వేశ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేములవాడకు దాదాపు 14 వేల బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామన్నారు. కౌన్సిలర్లు బింగి మహేశ్, గోలి మహేశ్, జడల లక్ష్మి, రెండుమిద్దల జయ, కో–ఆప్షన్ సభ్యులు నీరటి సువర్ణ, నాయకులు పుల్కం రాజు, కొండ కనకయ్య పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- పోడుభూముల పట్టాల పంపిణీ



పోడుపట్టాలు పంపిణీ చేస్తున్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రుద్రంగి(వేములవాడ): మానాల, గిరిజన తండా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలని అన్ని విధాలా అభివృద్ధి చేశానని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మానాల, గిరిజనతండా గ్రామాల్లో తాతమ్మవాగుపై రూ.2.2 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి, మానాల నుంచి గొర్రెగుండం వరకు రూ.1.12 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గిరిజనులకు పోడుభూముల పట్టాల పంపిణీ చేసి, దెగావత్‌తండా జీపీ భవనాన్ని ప్రారంభించి, బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనులను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలు ఓట్ల కోసం సాధ్యం కాని హామీలతో ఆశలు రేపుతున్నారన్నారు. వారి మోసపూరిత హామీలు నమ్మొద్దని, గిరిజనుల కోసం పనిచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో మాలోతు శంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు తొట్టిపాటి నర్సింహనాయుడు, రుద్రంగి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దెగావత్ తిరుపతి, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, గిరిజన తండా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద బాలికలు.. ఆటల్లో మెరికలు

- జాతీయస్థాయిలో గొల్లపల్లి జట్టు ప్రతిభ
- త్రోబాల్ పోటీల్లో రాణించిన నిరుపేద యువతులు
- యూట్యూబ్‌లో వీక్షణ.. మైదానంలో శిక్షణ



త్రోబాల్ పోటీలో తలపడుతున్న యువతులు



బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా మట్టిలో పుట్టిన మాణిక్యాలు. టాలెంట్‌కు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. తొలిసారి జాతీయస్థాయిలో ఆడినప్పటికీ ఐదో స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన విద్యార్థినులు జాతీయస్థాయిలో రాష్ట్రం తరఫున త్రోబాల్ క్రీడలో పోటీపడ్డారు. బలమైన ప్రత్యర్థులు ఎదురైన మొక్కవోని ధైర్యంతో పోరాడి ఐదో స్థానంలో నిలిచారు.

స్థానికంగానే శిక్షణ

రాచర్లగొల్లపల్లికి చెందిన 8 మంది యువతులు రాష్ట్ర జట్టు తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు బైరగోని అనిల్ ఆధ్వర్యంలో శిక్షణలో రాటుదేలారు. గత జూలై నెలాఖరులో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో గ్రామోత్సవ్ మహిళ త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ 8 మంది యువతులు ఓ జట్టుగా ఏర్పడ్డారు. వీరికి పీఈటీ అనిల్ త్రోబాల్ క్రీడ నియమాలు, ఆడే విధానంపై యూట్యూబ్‌లో వీడియోలు చూసి అవగాహన కల్పించారు.

జిల్లా నుంచి జాతీయ స్థాయికి..

గత ఆగస్టులో జిల్లాలో నిర్వహించిన త్రోబాల్ పోటీలలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గొల్లపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సెప్టెంబర్ 10న నాచారంలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జాతీయస్థాయికి ఎంపికైన వీరు రెట్టింపు ఉత్సాహంతో పోటీలకు సన్నద్ధమయ్యారు. గత నెల 21 నుంచి 23 వరకు కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో మొదటి ప్రయత్నంలోనే ఐదోస్థానంలో నిలిచారు.

పేదరికాన్ని అధిగమించి..

త్రోబాల్ జట్టులోని 8 మంది క్రీడాకారిణులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. ముద్రకోల తిరుపతి–సుజాత దంపతుల కూతురు అఖిల జట్టు కెప్టెన్ వ్యవహరించింది. పెద్దూరి లక్ష్మి–మల్లయ్య దంపతుల కూతురు రమ్య, పెద్దూరి రేణుక–భిక్షపతి కూతురు స్రహన బీపీఈడీ ఫస్టియర్, పెండ్యాల నర్సవ్వ–లక్ష్మీనర్సయ్యల కూతురు మనీశా ఇంటివద్దనే బీడీలు చుడుతుంది. బోయిని అంజమ్మ–శంకర్‌ల కూతురు భార్గవి డిగ్రీ చదివి, టైలరింగ్ చేస్తుంది. గోగూరి శ్రీనివాస్‌రెడ్డి–అంజలి, దాసరి లత–రమేశ్ దంపతుల కూతుళ్లు రిచిత, దివ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు.

ఐదో స్థానంలో నిలిచాం



నా పేరు ముద్రకోల అఖిల. మాది ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి. మా తల్లిదండ్రులు హోటల్ నడుపుతారు. నేను వారికి హోటల్ పనిలో సాయం చేస్తుంటాను. స్కూల్‌లో ఉన్నప్పుడే వాలీబాల్‌పై పట్టు ఉంది. డిగ్రీ పూర్తి చేశాను. పీఈటీ అనిల్ సార్ త్రోబాల్‌లో శిక్షణ ఇచ్చారు. నాకు కెప్టెన్‌గా అవకాశం వచ్చింది. గ్రామస్తుల ప్రోత్సాహంతో జాతీయస్థాయిలో ఆడేందుకు వెళ్లాం. మొదటిసారి జాతీయస్థాయిలో కష్టమైన గేమ్స్‌లోనూ రాణించి ఐదో స్థానం సాధించాం.

పట్టుదలతో జాతీయ స్థాయికి..



అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని పట్టుదలతో త్రోబాల్‌లో జాతీయ స్థాయికి ఎదిగాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పీఈటీ అనిల్ సారు శిక్షణతో ఈ స్థాయికి వచ్చాం. రానున్న రోజుల్లో మరింత కష్టపడి మరిన్ని పతకాలు సాధిస్తా. మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ఐదోస్థానంలో రాణించడం ఆనందంగా ఉంది.

– గోగూరి రిచిత, విద్యార్థిని

గర్వంగా ఉంది



మాములు స్థాయి నుంచి యువతులు జాతీయస్థాయిలో ఆడడం గర్వంగా ఉంది. పూర్వ, ప్రస్తుత విద్యార్థులు త్రోబాల్ ఆడేందుకు ఒప్పుకోవడంతో నాకు వారిపై విశ్వాసం కలిగింది. నాతోపాటు మా విద్యార్థులకు అందరికి త్రోబాల్ క్రీడ కొత్తదే. రెండు నెలలపాటు ఆటతీరు, నియమాలు తెలుసుకుంటూ శిక్షణ అందించాం. మా కృషికి తగిన విధంగా జాతీయస్థాయిలో ఆడడం సంతోషంగా ఉంది.

– బైరగోని అనిల్, త్రోబాల్ కోచ్

క్లుప్తంగా

ఇద్దరు సీఐలకు వారంట్లు

వేములవాడ: మూడు వేర్వేరు కేసుల్లో దర్యాప్తు అధికారులుగా ఉన్న ఇద్దరు సీఐలు బన్సీలాల్, నవీన్‌కుమార్ సాక్షులుగా కోర్టుకు హాజరు కావాలని కోర్టు జారీ చేసిన సమన్లు స్వీకరించి హాజరుకానందుకు గురువారం వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సట్టు రవీందర్ బెయిల బుల్ వారెంట్లు జారీ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి తెలిపిన వివరాలు. వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐలుగా విధులు నిర్వహించిన సమయంలో బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు హత్యాయత్నం కేసుల్లో బన్సీలాల్ దర్యాప్తు అధికారిగా ఉన్నారు. అదే పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో హత్యాయత్నం కేసులో నవీన్‌కుమార్ దర్యాప్తు అధికారిగా ఉన్నారని.. సాక్ష్యం చెప్పేందుకు కోర్టుకు హాజరుకావాలని సమన్లు జారీ అయ్యాయి. సమన్లు స్వీకరించిన వారు కోర్టుకు హాజరుకాలేదు. దీంతో జడ్జి ఇద్దరికి వారంట్లు జారీ చేశారు. ఆ కేసులను ఈనెల 12వ తేదీకి వాయిదా వేశారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

● డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కాంగ్రెస్‌ను రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. రుద్రంగిలో గురువారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే 6 డిక్లరేషన్ కర పత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తూము జలపతి, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని కంచర్ల శివారులో ఎస్సై నవత ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా అర కిలో గంజాయి లభించింది. మండలంలోని గర్జనపల్లికి చెందిన గుమ్మడి భరత్, వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన సామల్ల కార్తీక్‌గా గుర్తించారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

మున్సిపల్ రియల్ వ్యాపారం ఆపాలి


మాట్లాడుతున్న గోపి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్‌శాఖ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఆపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ రియల్ ఎసేఉట్టట్ వ్యాపారం ప్రారంభించందని దానికి అనుమతి ఎవరిచ్చారు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిలిపివేయాలని నిరసన తెలిపిన బీఆర్ఎస్ పార్టీనే ఇప్పుడు అదే వ్యాపారం చేయడం ఏంటని ప్రశ్నించారు. తక్కువ ధర నిర్ణయించి అధికార పార్టీ నాయకులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, జిల్లా కార్యదర్శి గజభీంకార్ చందు, నాయకులు తిరుపతిరెడ్డి వంగ అనిల్ కుమార్, బాలయ్య, ప్రవీణ్, రాజేందర్, రాజు, వంశీ ఉన్నారు.

కష్టపడ్డారు.. కొలువు కొట్టారు

● లాఠీ పట్టనున్న జిల్లా యువతీయువకులు
● నిరుపేద కుటుంబాల్లో వెలుగులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నిరుపేద కుటుంబాల్లో పుట్టిన వారు అనేక కష్టాలు అనుభవించి, అనుభవం నేర్పిన పాఠాలతో చదివి, కొలువు కొట్టారు. తండాల్లో ఉండి, గురుకులాల్లో చదివి, హాస్టల్ జీవితాలు అనుభవించి పడిన కష్టాలు వారిని విజయతీరాల వైపు నడిపించాయి. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఏడుగురు పోలీస్‌శాఖలో కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించడంతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఉద్యోగాలు సాధించినవారిని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ అభినందించారు.

వ్యవసాయ పనులకు వెళ్తూ..


మమత

ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లికి చెందిన మందాటి కొమురయ్య కూతురు మమత సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. వ్యవసాయ కుటుంబం కావడంతో ఆమె తల్లితండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తూ బీటెక్ వరకు చదువుకుంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌గా ఎంపికైంది.

తండ్రి మృతి.. అన్నీ అమ్మే..


తల్లితో కల్యాణి

ఎల్లారెడ్డిపేట మండలంలోని బుగ్గరాజేశ్వర తండాకు చెందిన భూక్య ప్రమీల–బన్నాజీ దంపతులకు ముగ్గురు సంతానం. మూడో కూతురు కల్యాణి హాస్టల్‌లో ఉంటూ పీజీ వరకు చదివింది. తండ్రి 15 ఏళ్ల క్రితం మరణించగా.. తల్లి అన్నీ తానై పిల్లలను చూసుకుంది. గుంట వ్యవసాయ భూమి లేకున్నా కూలీ పనులు చేసి, ఉన్నత చదువులు చదివిపించింది. కల్యాణి సైతం సెలవు రోజుల్లో పనికి వెళ్తూ చదువుకుంది. ప్రస్తుతం ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది.

టిఫిన్ సెంటర్ నడుపుతూ..


మధు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన సలేంద్రి మధుది వ్యవసాయ కుటుంబం. ఇంజినీరింగ్ చదివి, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యాడు. 2018లో పోలీస్ ఉద్యోగానికి ప్రయత్నించగా త్రుటిలో తప్పింది. 2022లో ఆయుష్మాన్ భవ మిల్లెట్ టిఫెన్ సెంటర్ ప్రారంభించాడు. దాన్ని నడుపుతూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. తాజాగా టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

భర్త ప్రోత్సాహంతో..


కుటుంబసభ్యులతో మమత

సిరిసిల్లఅర్బన్: కోనరావుపేట మండలంలోని వట్టిమల్లకు చెందిన మమతకు 2013లో చంద్రంపేటకు చెందిన కొమిరె మహేశ్‌తో వివాహమైంది. అత్త, భర్త ప్రోత్సాహంతో పెళ్లయిన తర్వాత కూడా చదువు కొనసాగించింది. డిగ్రీ, బీఈడీ చేసి, టెట్‌లో అర్హత సాధించింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యావలంటీర్‌గా పని చేసింది. ప్రస్తుతం మొదటి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది.

వ్యవసాయ కూలీ కుమారుడు..


అమ్మానాన్నతో శ్రీకాంత్

వేములవాడ అర్బన్: సంకెపల్లికి చెందిన దోమకొండ కనకయ్య–కనకమ్మ దంపతుల చిన్న కుమారుడు శ్రీకాంత్ టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. నిరుపేద కుటుంబం కావడంతో తండ్రి గల్ఫ్ వెళ్లి, వచ్చి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. శ్రీకాంత్‌ను ఉన్నత చదువులు చదివించారు. కష్టపడితేనే ఫలితం ఉంటుందన్న తండ్రి మాటలతో ఇన్‌స్పైర్ అయ్యి చదివాడు. కానిస్టేబుల్ కొలువు కొట్టాడు.

అమ్మే అన్నీ తానై..


అమ్మ సునీతతో అరవింద్

వేములవాడ అర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లికి చెందిన పులి రవీందర్–సునీత దంపతుల పెద్ద కుమారుడు అరవింద్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. తండ్రి రవీందర్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తల్లి అన్నీ తానై అరవింద్‌ను చదివించింది. అమ్మ కష్టాన్ని చూసిన అతను ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి చదివాడు. ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకొని, కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

అక్కాచెల్లెళ్లు ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులే


చెల్లెళ్లతో లహరిప్రియ (కుడివైపు)

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్లకు చెందిన రైతు దంపతులు దొడ్ల దేవేందర్–రేఖలకు ముగ్గురు కూతుళ్లు. వారిని ఎప్పుడూ చిన్నచూపు చూడకుండా ఉన్నత చదువులు చదివించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఆ అక్కాచెల్లెళ్లు లహరిప్రియ, లతశ్రీ, లిఖిత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, శభాష్ అనిపించుకున్నారు. మొదట చెల్లెళ్లు లతశ్రీ వ్యవసాయ శాఖలో ఏఈవోగా, లిఖిత సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు పొందారు. తాజాగా అక్క లహరిప్రియ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది.


జుట్టు రవితేజ, కోరెం


ఆనంద్ కిశోర్, నీలోజిపల్లి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లికి చెందిన జక్కని జగన్నాథం కుమారుడు ఆనంద్ కిషోర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. కోరెం గ్రామానికి చెందిన జుట్టు రవితేజ ఐటీ కమ్యూనికేషన్ విభాగంలో కానిస్టేబుల్, దుండ్రపల్లికి చెందిన చిర్ర బుచ్చిలింగం కుమారుడు పవన్‌కల్యాణ్ ఏఆర్ కానిస్టేబుల్, గోగూరి రవీందర్‌రెడ్డి కుమారుడు అరవింద్‌రెడ్డి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు.

తండ్రి కష్టానికి ఫలితం


ఒద్యారం స్వపూర్వ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన ఒద్యారపు గంగరాజు–రాధ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కూతురు స్వపూర్వ హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని, సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. తండ్రి మేషన్ పనిచేస్తూ కష్టపడి చదివించాడని, దానికి ఫలితం దక్కిందని ఆమె చెబుతోంది.

రైతుబిడ్డ విజయం


కోడం గంగరాజు

వేములవాడరూరల్: కాశాయపల్లికి చెందిన శ్రీనివాస్–రాధ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించారు. చిన్నప్పటి నుంచి పోలీస్ ఉద్యోగం అంటే గంగరాజుకు ఎంతో ఇష్టం. అదే కసితో కోచింగ్ తీసుకొని ఉద్యోగం సాధించాడు.

వ్యవసాయ కుటుంబం నుంచి..


కుటుంబసభ్యులతో రజిత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మొర్రాపూర్‌తండాకు చెందిన బట్టు పుష్పల–నాంపెల్లి దంపతుల కూతురు రజిత సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. బీఎస్సీ చదివిన ఆమె ఎలాంటి కోచింగ్ లేకుండానే ఉద్యోగం సాధించింది. రజిత సోదరుడు రాజు పీజీ, సోదరి శ్యామల నర్సింగ్ కోర్సు పూర్తి చేశారు. వీరిది వ్యవసాయ కుటుంబం.

కూలీ ఇంట పోలీస్


తల్లి విజయతో భానుప్రసాద్

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌కు చెందిన ఈర్ల చంద్రం–విజయ దంపతుల కుమారుడు భానుప్రసాద్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. డిగ్రీ పూర్తి చేసిన అతను ప్రణాళికాబద్ధంగా చదివి, ఈవెంట్స్ ప్రాక్టీస్ చేశాడు. తండ్రి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. తల్లి బీడీలు చుడుతూ కుమారుడిని చూసుకుంది. కోచింగ్ తీసుకొని, కొలువు కొట్టినట్లు భానుప్రసాద్ తెలిపాడు.

ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిది

● బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు


మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: తెలంగాణ సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిదని బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య, వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి సినారె, మిద్దె రాములులాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కవులు, కళాకారుల గడ్డగా పేరొచ్చిందని తెలిపారు. రానున్న రోజుల్లో కళా సంస్థలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి మ్యాడారం రాజేశం, కళాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బొడ్డు రాములు, జిల్లా అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, సేవా సంస్థ అధ్యక్షుడు మానువాడ లక్ష్మీనారాయణ, కార్యదర్శి వెంపటి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణ


నియామక పత్రం ఇస్తున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్‌కు చెందిన పసుల కృష్ణను నియమించారు. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పంపిన నియామక పత్రాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పార్టీ కార్యాలయంలో ఆయనకు అందజేశారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఊరడి ఎల్లయ్య, నాగరాజు, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు వంగ మల్లారెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, ఇమామ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైనవారికి సన్మానం


సన్మానించిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి

చందుర్తి(వేములవాడ): మల్యాల గ్రామానికి చెందిన అర్సం వికాస్ కుమార్ సివిల్, కొండం మనోజ్‌కుమార్ ఏఆర్, కట్కూరి అజయ్ ఏఆర్, మెరుగు ఉదయ్‌కుమార్ టీఎస్‌ఎస్పీ కానిస్టేబల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఇదే గ్రామానికి చెందిన భీమ్ ఆర్మీ యూత్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. అలాగే, నర్సింగాపూర్‌కు చెందిన పేరుక రణధీర్, వెంగళి జలంధర్, జాగిరి ప్రశాంత్, మల్యాల మనోజ్‌లు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించగా గ్రామస్తులు అభినందించారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): హరిదాస్‌నగర్‌కు చెందిన మానుక యోగరాజు జైలు వార్డెన్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అతన్ని జెడ్పీటీసీ సభ్యుడు చీటీ లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు.సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొంది, పోలీస్ ఉద్యోగాలు సాధించిన 8 మంది అభ్యర్థులను డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి రాఘవేందర్‌రావు, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, సిబ్బంది హరీశ్, సురేశ్, దివ్య, కిరణ్మయి, మురళి, ప్రసాద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలతో దద్దరిల్లిన సిరిసిల్ల


మోకాళ్లపై ఈ–పంచాయతీ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న 'మధ్యాహ్న' కార్మికులు


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

సిరిసిల్లటౌన్: కలెక్టరేట్ సమీపంలో ఈ–పంచాయతీ ఉద్యోగులు గురువారం మోకాళ్లపై కూర్చొని, నిరసన తెలిపారు. జిల్లా స్థాయిల్లో పనిచేసే ప్రాజెక్టు మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు పేస్కేల్ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలని, ఉద్యోగి మరణిస్తే కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండి స్వామి, గడ్డం శేషాద్రి, నర్సింగోజు శ్రీధర్, శానగొండ రమేశ్, శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులు..
తమ ఉద్యోగం పర్మినెంట్ చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కదారి రాములు మాట్లాడుతూ.. ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికులకు ఉద్యోగపరంగా భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనకలక్ష్మి తదితరులున్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశవర్కర్లు
ఆశవర్కర్లు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలంటూ ఆశవర్కర్లు డిమాండ్ చేయగా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ వచ్చి, వారి నుంచి వినతిపత్రం తీసుకున్నారు. ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య తదితరులున్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
పశ్నప్రతాల లీకేజీని నిరసిస్తూ ఏబీవీపీ నాయకులు గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు మాట్లాడుతూ.. తరచూ పోటీ పరీక్షలు రద్దవుతుండటంతో నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మారవేణి రంజిత్, మధు, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుదారులు..
గృహలక్ష్మి స్కీంను అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి స్కాంగా మార్చారని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మామిడాల దశరథం ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలో ఆర్థికంగా ఉన్న వారికి పథకం కింద నివేశన స్థలం ప్రొసీడింగ్స్ ఇప్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ విచారణ చేపట్టి, ప్రొసీడింగ్స్ అర్హులకు మాత్రమే ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. మామిడాల బుచ్చవ్వ, గుంటుకు లత, గాజుల సునీత, వడ్నాల మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికుల ధర్నా..
మున్సిపల్ పరిధిలోని పార్కులు, డివైడర్లు, ప్రధాన కూడళ్లకు సంబంధించిన శానిటేషన్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, సూరం పద్మ, నర్సయ్య, శ్రీకాంత్, శారద, నరేశ్, లలిత తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మూడెకరాలపై నిర్లక్ష్యం..
దళితులకు ప్రభుత్వం ఇస్తామన్న మూడెకరాల భూమిని ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఏఐఎఫ్‌బీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్ అన్నారు. తంగళ్లపల్లి మండలంలోని మండేపల్లి శివారులో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం నిరుపేదలు, దళితులకు చెందిన భూమిని తీసుకొని, వారి ఉపాధిని దెబ్బతీసిందని మండిపడ్డారు. వెంటనే వారికి భూమి ఇవ్వాలన్నారు. పీడిత వర్గాలను మోసం చేస్తున్న బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. నాయకుడు హరిబాబు, మండేపల్లివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన బందారపు మల్లారెడ్డి, అంగూరి మల్లయ్య అనారోగ్యంతో బుధవారం మరణించారు. వారి కుటుంబీకులను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు గురువారం పరామర్శించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బందారి బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు పిల్లి కిషన్, అజ్జు, గంట వెంకటేశ్‌గౌడ్, ఎలగందుల గణేశ్, బాబు, గోపాల్ ఉన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన దమ్మ శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా నాయకుల చేతుల మీదుగా గురువారం నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. పార్టీ బలోపేతానికి, ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

సిరిసిల్లఅర్బన్: విద్యార్థులు, నిరుద్యోగులను విస్మరిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువకుల బలిదానం వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కానీ విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని పేర్కొన్నారు. 2018లో నిరుద్యోగ భృతి చెల్లిస్తానని హామీ ఇచ్చి, ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా, నోటిఫికేషన్లు, పరీక్ష నిర్వహణలో తప్పులు, లీకేజీలు చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆటాలడుకుంటున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. జిల్లా కార్యదర్శి రంజిత్, నాయకులు శ్రవణ్, గణేశ్, అక్షిత్, రాము తదితరులున్నారు.

నారాయణపూర్‌లో ఎలుగుబంటి సంచారం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. రాగట్లపల్లి నుంచి నారాయణపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం ఎలుగుబంటి సంచరించడాన్ని చూసిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు నారాయణపూర్‌కు వెళ్లే దారిలో ఎలుగుబంటి కోసం గాలిస్తున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి సకారాంనాయక్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలుగుబంటి సీతాలబండ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించామన్నారు. రైతులు రాత్రి పూట జాగ్రత్తగా ఉండాలని సూచించారు.